
సాక్షి ఒడిశా
ఆదివారం । 25 । జూన్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2,76,486లు, వెండి 20 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



సంసిద్ధతే విపత్తు విజయ రహస్యం

- 8లో

డీఆర్‌డీఏ సీడీఎం బదిలీ

పర్లాకిమిడి: గజపతి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య అభివృద్ధి అధికారి, కార్యనిర్వాహణ అధికారి రమాంచల్ ఖమారీకు బదిలీ అయ్యింది. ఆయన స్థానంలో దేవ్‌ఘడ్ సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న బ్రజబంధు భోయిని నియమించినట్లు ప్రభుత్వ అదనపు కార్యదర్శి ఎస్.ఎస్.సాహు శనివారం ఉత్తర్వ్యులు జారీ చేశారు. రమాంచల్ ఖమారీకి ఎక్కడికి బదిలీ అయ్యిందనే విషయాన్ని ఉత్తర్వ్యుల్లో పేర్కొన్నలేదు.

న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్

పర్లాకిమిడి: గజపతి జిల్లా నూతన కలెక్టర్‌గా స్మృతి రంజన్ ప్రధాన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు కలెక్టర్‌గా విధులు నిర్వహించిన లింగరాజ్ పండా రాష్ట్ర మహిళా శిశు వికాస్, సామాజిక సంక్షేమ శాఖ డైరక్టర్‌గా భువనేశ్వర్‌కు బదిలీ అయ్యారు. దీంతో ఆయన స్థానంలో స్మృతి రంజన్ ప్రధాన్ నియామకమయ్యారు. దీనిలో భాగంగా శనివారం ఉదయం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏడీఎం రాజేంద్ర మింజ్, డీఆర్‌డీఏ ముఖ్య కార్య నిర్వాహణ అధికారి రమాంచల్ ఖమారీ, జిల్లా సమగ్ర గిరిజనాభివృద్ధి పీవో ఫాల్గుణి మరియు, డిప్యూటీ కలెక్టర్ బిరేంద్ర కుమార్ దాస్, ఆర్అండ్‌బీ సూపరింటెండింగ్ ఇంజినీరు శ్రీకాంత్ సామల్, సబ్ కలెక్టర్ అలోక్ కుమార్ ప్రధాన్, లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ పనుల్లో జాప్యం తగ్గించి, లబ్ధిదారులకు సకాలంలో ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు.

జాతీయ పోటీలకు మహిళా బాక్సర్లు



బాక్సింగ్ క్రీడాకారులతో క్రీడా సంఘాల ప్రతినిధులు

బరంపురం: కళింగ ఉత్కల ఆకాడమీ ఆధ్వర్యంలో జరగనున్న జాతీయ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో గంజాం జిల్లాకు చెందిన ముగ్గురు మహిళా బాక్సర్లు పోటీ పడనున్నారు. ఈనెల 26వ తేదీ నుంచి జూలై 1వ తేదీ వరకు కటక్‌లో జరగనున్న ఈ పోటీలకు బాక్సింగ్ క్రీడాకారులు బరంపురం రైల్వేస్టేషన్ నుంచి శనివారం బయల్దేరారు. బాక్సర్లకు నగరంలోని క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటుసార, బెల్లం ఊటలు

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్, రాయగడ, శిఖిల్ తదితర ప్రాంతాల్లోని సారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ అధికారులు శుక్ర, శనివారాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించారు. కల్యాణ సింగుపూర్ సమితి బెలకొన ప్రాంతంలో నిర్వహించిన దాడుల్లో 8,100 లీటర్ల ఊట, 475 లీటర్ల నాటుసారా, అదేవిధంగా రాయగడ సమితిలోని సందుబడి, పలమతులసి, దుర్గాపాడు, రాయగడ ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో 5,100 లీటర్ల ఊట, 350 లీటర్ల నాటుసారా స్వాదీనం చేసుకున్నట్లు అబ్కారీ శాఖ ఎస్పీ అభిరాం బెహర తెలియజేశారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు అందజేస్తున్న అటవీ శాఖ సిబ్బంది

పర్లాకిమిడి: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని డీఎఫ్‌వో ఆనంద్ అన్నారు. ఈ మేరకు మొక్కలు నాటుదాం-పచ్చదనాన్ని పెంచుదాం అనే నినాదంతో స్థానిక ఎస్‌కేసీజీ హాస్టల్ వద్ద జామ, ఉసిరి, మామిడి ఇతర మొక్కలను ఒక్క రూపాయకే అందజేస్తున్నారు. దీంతో ప్రజలు అత్యధిక సంఖ్యలో కొనుగోలు చేస్తున్నారు. మొక్కల పంపిణీలో దేవగిరి రేంజ్ అటవీ సిబ్బంది పి.వెంకటరమణ, శివరాం సాబత్ తదితరులు పాల్గొంటున్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న బీజేడీ నాయకులు

బీజేడీ సంబరాలు

ప్రశాంత్ కుమార్ రౌత్‌పై విజిలెన్స్ దాడులు జరగడంతో అధికార బీజేడీ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బాణసంచా కాల్చారు. స్థానికులకు మిఠాయిలు పంపిణీ చేశారు. అవినీతికి వ్యతిరేకంగా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పని చేస్తున్నారన్నారు. నవీన్ పాలనలో అవినీతికి చోటులేదని నినాదాలు చేశారు. కార్యక్రమాల్లో కార్యకర్తలు ఉత్తమ్ త్రిపాఠీ, సరోజ్ పాత్రో తదితరులు పాల్గొన్నారు. మరోవైపు జిల్లాకి చెందిన అధికార పార్టీలోని ముఖ్య యువనేత ఈ దాడులు చేయించారని ప్రచారాలు కొనసాగుతున్నాయి. ఆ యువ నేత పలుమార్లు జిల్లాలో అవినీతి అధికారులకు హెచ్చరికలు చేసిన ఘటనలు ఉన్నాయి.

- కొనసాగుతున్న విజిలెన్స్ సోదాలు
- వెలుగులోకి బినామీ అకౌంట్లు
- ప్రస్తుతం సుమారు రూ.5 కోట్ల నగదు, ఒక ఇల్లు, వాహనాలు సీజ్
- రాజకీయ పార్టీల ఆరోపణలు

కొత్తగా సబ్ కలెక్టర్‌గా బిజయ కుమార్ బెహరా



ప్రస్తుత అదనపు సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ రౌత్ విజిలెన్స్ వలలో చిక్కడంతో ప్రభుత్వం తక్షణ చర్యలకు ఉపక్రమించింది. నబరంగ్‌పూర్ నూతన సబ్ కలెక్టర్‌గా బిజయ కుమార్ బెహరా నియమితులయ్యారు. పురుషోత్తంపూర్ బీడీవోగా ఉన్న బిజయ్‌ని నబరంగ్‌పూర్ బదిలీ చేసింది.

కట్టల పాముపై కొరడా

మండిపడిన బీజేపీ



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నబరంగ్‌పూర్ అదనపు సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ రౌత్ వద్ద రూ.కోట్ల నగదు పట్టుబడడంపై బీజేపీ మండిపడింది. ఇది ప్రభుత్వంలోని అధికారులకు, పార్టీ నాయకులకు చెందిన నగదు అని ఆ పార్టీ మాజీ ఎంపీ బలభద్ర మజ్జి ఆరోపించారు. శనివారం సాయంత్రం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని చమిరియా గుడలో ఉన్న పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. దీనిని వాటాల పంపిణీలో వచ్చిన విభేదాల వలన వెలుగులోనికి వచ్చిన నల్లధనంగా అభివర్ణించారు. నగదు పట్టుకున్న అధికారులు, ఆ నగదు ఎలా వచ్చిందో, ఎవరెవరు ఇచ్చారో విచారణ చేయాలన్నారు. ఇంత నగదు లంచంగా ఇచ్చిన వారు ఇంకెంత ప్రజాధనం దోపిడీ చేసి ఉంటారోనని అనుమానం వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు జగదీష్ బిసాయి, గౌరి మజ్జి, షర్మిష్టా దేవ్, దేవదాస్ మహంకుడో తదితరులు పాల్గొన్నారు.



విజిలెన్స్ అదుపులో ఉన్న ప్రశాంత్ కుమార్ రౌత్

కొరాపుట్: విజిలెన్స్ వలలో చిక్కిన నబరంగ్‌పూర్ అదనపు సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ రౌత్ లక్ష్యంగా సోదాలు కొనసాగుతున్నాయి. శనివారం సోదాలు జరిపిన ప్రాంతాలను అధికారులు పెంచారు. దర్యాప్తులో అనేక కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అనేక బినామీ బ్యాంక్ ఖాతాలు, డెబిట్, క్రెడిట్ కార్డులు పట్టుబడ్డాయి. అందులో భుబనేశ్వర్‌లోని చంద్రశేఖర్‌పూర్ యాక్సిస్ బ్యాంక్‌లో ఖాతా ఉన్న నివేదిత జెన్న అనే మహిళని అధికారులు పిలిపించారు. అయితే పేరుతో అకౌంట్ ఉండడంపై ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 2016లో రాజఖనికలో బీడీవోగా ఉన్న ప్రశాంత్ కుమార్ రౌత్‌ని తాను కలిసినట్లు తెలియజేశారు. తనకు బియ్యం కార్డు ఇప్పించమని ప్రాదేయపడ్డానని, అప్పుడే తన ఆధార్ వివరాలు అందజేశానని వెల్లడించారు. ఈమె పేరు మీద ఉన్న అకౌంట్ నుంచి అనేక రూ.లక్షలు లావాదేవీలు జరిగాయి. ఆమెలాగే అనేక మంది పనివాళ్లు, డ్రైవర్లు పేరు మీద ఆస్తులు బయటపడుతున్నాయి. ప్రస్తుతం రూ.5 కోట్ల నగదు, ఒక ఇల్లు, వాహనాలు విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

భారతమాల నిర్వాసితుల హర్షం

ప్రశాంత్ కుమార్ పట్టుబడడంపై భారతమాల నిర్వాసితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రూ.20 వేల కోట్ల వ్యయంతో విశాఖపట్నం నుంచి రాయ్‌పూర్‌కి 6 అంచెల ఎకనామిక్ కారిడర్‌ని భారతమాల పేరిట రోడ్డు నిర్మిస్తుంది. దీనిలో నబరంగ్‌పూర్ జిల్లాలో అత్యధిక భాగం భూసేకరణ జరిగింది. భూసేకరణలో భాగంగా వేలాది మంది గిరిజనులు నిర్వాసితులయ్యారు. వారికి అందే పరిహారాల విషయంలో ప్రశాంత్ ఎంతో కీలకంగా వ్యవహరించారని ఆరోపణలు ఉన్నాయి. సబ్ కలెక్టర్ హోదాలో అనేక ప్రభుత్వ భూములకు నకిలీ యజమానులను సృష్టించి రూ.కోట్లు దోచుకున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై రాయిఘర్ బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో కేంద్ర హోం శాఖ ఈ వ్యవహారంపై చర్యలకు ఉపక్రమించిందని రాయిఘర్ నేతలు ప్రకటించారు. అందులో భాగంగానే దాడులు జరిగాయని పేర్కొన్నారు. మరోవైపు కొద్దిరోజుల క్రితం ఒక ప్రైవేటు పరిశ్రమకి వెళ్లి ప్రశాంత్ తనిఖీలు చేపట్టడం సంచలనం కలిగించింది. దీంతో సదరు పరిశ్రమల యజమానుల సంఘం ప్రతినిధులు తమను వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేశారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

- 8 జిల్లాలకు భారీ వర్ష సూచన: ఐఎండీ

భువనేశ్వర్: వాయువ్య బంగాళాఖాతంలో ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలకు ఆనుకుని 7.6 కి.మీ ఎత్తుకు విస్తరించి వాయుగుండం ఏర్పడింది. దీని ప్రభావంతో రానున్న 24 గంటల్లో బంగాళాఖాతంతో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శనివారం హెచ్చరిక జారీ చేసింది. దీంతో కెంజొహార్, మయూర్‌భంజ్, బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రాపడా, ఢెంకనాల్ మరియు కటక్ జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు వాతావరణ కేంద్రం 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించింది. అదేవిధంగా మరో 24 గంటల్లో జగత్‌సింగ్‌పూర్, పూరీ, ఖుర్దా, అంగుల్, దేవ్‌గఢ్, సుందర్‌గఢ్, సంబల్‌పూర్, బౌధ్, కంధమల్, కలహండి, నవరంగపూర్, కొరాపుట్ మరియు మల్కన్‌గిరి జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు ఐఎండీ 'ఎల్లో' అలర్ట్ జారీ చేసింది. అలాగే భువనేశ్వర్ పరిసర ప్రాంతాల్లో ఆకాశం సాధారణంగా మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల వర్షాలు లేదా ఉరుములు, మెరుపులతో కూడిన వాతావరణం ఉంటుందని పేర్కొన్నారు. అల్పపీడన ప్రభావంతో ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు ఒడిశా తీరం వెంబడి పశ్చిమ మధ్య బంగాళాఖాతం ఆనుకుని ఉత్తర బంగాళాఖాతం మీదుగా గంటకు 45 నుంచి 55 కి.మీ వేగంతో ఉపరితల గాలుల వేగం ఉంటుంది. ఈ సమయంలో మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని స్పష్టం చేసింది.

భార్య హత్య కేసులో దోషిగా మాజీ ఎమ్మెల్యే

భువనేశ్వర్: భార్య హత్య కేసులో మాజీ ఎమ్మెల్యేని దోషిగా స్థానిక కోర్టు నిర్ధారించింది. వివరాల్లోకి వెళ్తే.. 27 ఏళ్ల క్రితం గుణుపురం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే రామమూర్తి గొమాంగో భార్య అనుమానస్పద మృతి కేసు విచారణలో హత్యగా తేలింది. ఈ కేసు విచారణ జరిపిన స్థానిక కోర్టు మాజీ ఎమ్మెల్యేనే ఈ కేసులో దోషిగా ప్రకటించింది. 11 మంది సాక్షుల వాంగ్మూలాలు, 15 పత్రాల ఆధారంగా కోర్టు అతడిని దోషిగా నిర్ధారించింది. శిక్ష వివరాలను మంగళవారం ప్రకటిస్తామని సంబంధిత వర్గాలు తెలిపాయి. అతని భార్య సగం కాలిన మృతదేహాన్ని 1995 సంవత్సరంలో స్థానిక ఖారవేళ నగర్‌లో ఎమ్మెల్యే నివాసం నుండి స్వాధీనం చేసుకున్నారు. అప్పటికి ఆమె గర్భవతి అని గుర్తించారు. తొలుత అసహజ మరణంగా కేసు నమోదు చేసిన పోలీసులు ఆ తర్వాత హత్య కేసుగా ధ్రువీకరించారు.

గొమాంగో రాజకీయ ప్రస్థానం

1995లో గుణుపురం నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి జనతాదళ్ టికెట్‌పై రామమూర్తి గొమాంగో ఎన్నికయ్యారు. అనంతరం 2000 సంవత్సరంలో బీజేపీలో చేరారు. 2000లో గుణుపూర్ నుంచి బీజేపీ టికెట్‌పై పోటీ చేసి 30 వేలకు పైగా ఓట్ల ఆధిక్యంతో మరలా ఎన్నికయ్యారు. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో అతను తన సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి హేమా గొమాంగోపై 20,000 ఓట్ల తేడాతో ఓడిపోయాడు. 2009లో బిజూ జనతా దళ్, భారతీయ జనతా పార్టీ కూటమి విడిపోవడంతో బీజేపీ నుంచి దూరమయ్యారు. అయితే 2014 సంవత్సరం సార్వత్రిక ఎన్నికల్లో గుణుపురం అసెంబ్లీ స్థానానికి పోటీ చేసేందుకు బీజేడీ టిక్కెట్ నిరాకరించడంతో ఆయన తిరిగి మరలా బీజేపీలో చేరారు.

భారీగా గంజాయి స్వాధీనం



జయపురం: నిందితుడు, గంజాయిని చూపిస్తున్న పోలీసులు



జయపురం: పట్టుబడిన గంజాయితో అరెస్టు చేయబడిన నిందితులను చూపిస్తున్న పోలీసులు



రాయగడ: గంజాయితో పట్టుబడిన నిందితుడు

జయపురం: సదర్ పోలీసులు గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు వారికి గంజాయి అమ్మిన ఒక వ్యక్తిని అరెస్టు చేశారని పోలీసు అధికారి ఈశ్వర తండి శనివారం వెల్లడించారు. పట్టుబడిన వారు కలహండి జిల్లా భవానీపట్న రైల్వేస్టేషన్ నకిటిగుడ రాజేష్ పండ(40), ద్వారిక స్టేషన్ రోడ్డు రామేశ్వర మెహర(44)లు కాగా, వారికి గంజాయి అమ్మిన వ్యక్తి కొరాపుట్ జిల్లా మాంచ్‌ఖండ్ పోలీసుస్టేషన్ పరిధి సనకిచబ గ్రామానికి చెందిన మంగళ మండి(50)గా పేర్కొన్నారు. ఒక పాలిథిన్ సంచిలో 31 కేజీల గంజాయితో పాటు వారి నుంచి ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలియజేశారు.

వివరాల్లోకి వెళ్తే..

పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి విజయవాడ-రాంచీ 326 జాతీయ రహదారి డొంగరచించి గ్రామ కూడలి వద్ద సబ్ ఇన్‌స్పెక్టర్ రాజ కిశోర్ బారిక్ నేతృత్వంలో పోలీసుల టీమ్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో ఒక స్కూటీలో ఇద్దరు వ్యక్తులు గంజాయితో వస్తుండగా, పోలీసులు వారిని ఆపి తనిఖీ చేయగా కవర్‌లో గంజాయి పట్టుబడిందని వెల్లడించారు. గంజాయితో పాటు గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి విచారించగా, వారు కలహండి జిల్లా భవానీపట్న వాసులని, మాచ్‌ఖండ్ పరిధి మంగళ మండి వద్ద గంజాయి ఖరీదు చేసిన విషయం వెల్లడైందన్నారు. పోలీసులు ముగ్గురినీ అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గంజాయితో ఒకరు అరెస్టు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ పోలీసుస్టేషన్ పరిధి రాయగడ-గజపతి సరిహద్దు ప్రాంతమైన డకిరిగుడ కూడలిలో శుక్రవారం రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గజపతి జిల్లా అడవ నుంచి ఒక బైకుపై గంజాయిని తీసుకొస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. అతను 3 బ్యాగుల్లో తరలిస్తున్న 80 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని, శనివారం కోర్టుకు తరలించినట్లు పోలీసులు ఒక ప్రకటనలో వెల్లడించారు. నిందితుడు అడవ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా పోలీసులు తెలియజేశారు.

220 కేజీల గంజాయి పట్టివేత

జయపురం: సదర్ పోలీసులు 220 కేజీల గంజాయి పట్టుకున్నట్లు సదర్ పోలీసుస్టేషన్ అధికారి ఈశ్వర తండి వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. స్థానిక సునానగర్ జంక్షన్ వద్ద సబ్ ఇన్‌స్పెక్టర్ శంకర పండా నేతృత్వంలో పోలీసులు శనివారం తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో చత్తీష్‌ఘడ్ రిజిస్ట్రేషన్‌తో ఒక కారు రావడంతో ఆపి తనిఖీ చేయగా, అందులో గంజాయి బయటపడిందని వెల్లడించారు. కారులో ఉన్నటువంటి ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు ఛత్తీష్‌ఘడ్‌కు చెందిన జయంత యాదవ్(24), మరొకరు మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాజేష్ కరచార్(46)లుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. అలాగే వారికి గంజాయి సరఫరా చేసి ఒక బైక్‌పై వస్తున్న బొయిపరిగుడ సమితి ఝెుడొయగుడ వాసి రఘునాథ్ ఖిలో కుమారుడు రబి ఖిలో(26)ను పట్టుకొన్నట్లు వెల్లడించారు. ముగ్గురినీ అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.22 లక్షలు ఉంటుందని తెలియజేశారు.

గంధపు చెట్టు దొంగలించిన వ్యక్తులు అరెస్టు



గంధపు చెట్టు దుంగతో పట్టుబడిన నిందితులు

జయపురం: విలువైన గంధం చెట్టు దుంగలను దొంగిలించిన నలుగురు నిందితులను జయపురం సదర్ పోలీసులు అరెస్టు చేసినట్లు సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి శుక్రవారం వెల్లడించారు. వారి నుంచి రూ.50 వేలు విలువ చేసే గంధపు దుంగను స్వాధీన చేసుకున్నట్లు పేర్కొన్నారు. అరెస్టైనవారు దామాపుట్ గ్రామంలోని పొరజ వీధికి చెందిన రామదాస్ పొరజ(27), మూలసర గ్రామానికి చెందిన రఘునాథ్ భూమియ(52), సునాధర భూమియ(35), శ్యామ జాని(32)లుగా వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 19వ తేదీ రాత్రి దామాపుట్ గ్రామంలోని న్యాయవాది బలరాం ఖొర ఫార్మ్ హౌస్‌లోని గంధపు చెట్టును కొందరు దుండగులు నరికి వేశారు. ఫార్మ్‌హౌస్‌లో నిద్రిస్తున్న కాపలాదారు చెట్టు కొడుతున్న శబ్దానికి లేచి, ఆ ప్రాంతంలో ఉన్నవారిని లేపేందుకు ప్రయత్నించగా దుండగులు రెండు గంధపు దుంగలను తీసుకొని పారిపోయారు. ఈ విషయం యజమాని బలరాం ఖొరకు తెలియజేయగా ఈనెల 21వ తేదీన జయపురం సదర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఒక గంధపు దుంగను కనుగొని నలుగురు నిందితులను అరెస్టు చేశారు. నిందితులు ఎత్తుకుపోయిన మరో గంధపు దుంగ కోసం విచారిస్తున్నట్లు వెల్లడించారు.

కనీస అవసరాలు కల్పించడంలో విఫలం

- నేతాజీ ఆశయాలు నేరవేరలేదు
- ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జ్యోతిరంజన్ మహాపాత్రో



మాట్లాడుతున్న జ్యోతీరంజన్ మహాపాత్రో

జయపురం: స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా ప్రజలకు కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డ కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని జాతీయ ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జ్యోతీ రంజన్ మహాపాత్రో ఆవేదన వ్యక్తం చేశారు. నేతాజీ స్వయంగా నెలకొల్పిన ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ 84వ వార్షికోత్సవాన్ని జయపురంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం కోసం నేతాజీ సుభాష్ చంద్రబోష్ కన్న కలలు నేటికీ నెరవేరలేదన్నారు. దేశంలోని ప్రజలు ఆకలి, భయం, అత్యాచారాలతో పీడించబడుతున్నారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా నేతాజీ భావజాలాన్ని ప్రజలకు తెలియజేసేందుకు ఇంటింటికీ నేతాజీ కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు. ప్రస్తుతం నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, పెట్రోలు, డీజల్, వంట గ్యాస్ ధరలతో సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి శంభు ప్రసాద్ మహంతి, అధ్యక్షుడు గోవింద ఖిలో, ధన ఫివురియ, లక్ష్మీదొర, హరావతి దొళాయి, పూర్ణ గొలారి, సుబిత అజాద్ తదితరులు పాల్గొన్నారు.

రెండు కర్రల మిల్లులు సీజ్



అక్రమంగా రవాణా చేస్తున్న కలపతో పట్టుబడిన ఆటో



మిల్లులో పట్టుబడిన కర్రలు

జయపురం: చట్ట విరుద్ధంగా అక్రమంగా నడుపుతున్న రెండు కర్రల మిల్లులను అటవీ సిబ్బంది సీజ్ చేసినట్లు రేంజర్ సచ్చిదానంద పరిడ శనివారం వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. కలప అక్రమ రవాణా జరుగుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో ఫారెస్టర్, ఫారెస్టు గార్డ్, పారా కర్మచారిలతో ఒక టీమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆ టీమ్ శుక్రవారం రాత్రి పెట్రోలింగ్ జరుపుతుండగా, జిల్లా కేంద్ర ఆస్పత్రి వద్ద ఒక ఆటోలో కలపను పూల్‌బెడ గ్రామం వైపు తీసుకెళ్తున్నట్లు సమాచారం రావడంతో పెట్రోలింగ్ టీమ్ ఆటోను అనుసరించారు. అయితే ఈ విషయం పసిగట్టిన ఆటో డ్రైవర్ ఆటోను విడిచి పరారయ్యాడు. ఆటోలో 12 గుగ్గిలం కలప దూళాలు ఉన్నాయి. ఈ విషయంపై ఆ గ్రామ వాసులను విచారించగా ఎవరూ ఏమీ చెప్పలేదని, అయితే తనిఖీలు చేస్తుండా బయటకు రేకుల ఇల్లుగా కనిపించిన ఇంటిని శోధించగా లోపల రెండు కర్రల మిల్లులు బయట పడ్డాయని సచ్చిదానంద పరిడ వెల్లడించారు. వాటిలో లక్షల విలువ చేసే వందలాది కలప చెక్కలు కనిపించాయన్నారు. అందులో ఎవరూ లేకపోవడంతో స్థానికులను విచారించగా ఎవరూ యజమానుల వివరాలు తెలుపలేదని పేర్కొన్నారు. దీంతో రెండు మిల్లులను సీజ్ చేశామని వెల్లడించారు. దాడిలో ఫారెస్టర్ సునీల్ మహంతి, రంజిత నాయిక్, అరుణ జెన, ఫారెస్ట్ గార్డ్ అనిల్‌దాస్, గౌతమ స్వైన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వృద్ధుల సంరక్షణ కోర్సుల్లో ఉచిత శిక్షణ

శ్రీకాకుళం రూరల్: వృద్ధుల సంరక్షణ (ఎల్డర్లీ కేర్ టేకర్) కోర్సుల్లో 45 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పించనున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో పదో తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన 18 నుంచి 35 ఏళ్ల లోపు పురుషులు, స్త్రీలు అర్హులన్నారు. వృద్ధుల సంరక్షణకు సంబంధించిన అంశాలను, మెలకువలను ఈ శిక్షణలో నేర్పిస్తామన్నారు. అలాగే ఇంటర్ బైపీసీ పాసైన వారికి 9 పారా మెడికల్ కోర్సుల్లో, డిప్లమా పారామెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 7680945257, 7995013422 సంప్రదించాలన్నారు.

ప్రగతి దిశగా తీరం



రాజారాంపురం తీరంలో స్థానికులతో మాట్లాడుతున్న పర్యాటక అభివృద్ధి అధికారి నారాయణరావు

పోలాకి: జిల్లా తీర ప్రాంతంలో ప్రగతి దిశగా అడుగులు పడుతున్నాయని జిల్లా పర్యాటక అభివృద్ధి అధికారి ఎన్.నారాయణరావు తెలిపారు. రాజారాంపురం తీరంలో మత్స్యశాఖ, స్థానిక సచివాలయం సిబ్బందితో కలిసి శనివారం ఆయన పర్యటించారు. స్థానికులతో మాట్లాడుతూ అక్కడ ఉన్న అవకాశాలను గురించి తెలుసుకున్నారు. జిల్లాలో దాదాపు 8 చోట్ల తీరప్రాంతంలో పర్యాటకంగా అనువుగా ఉన్న ప్రదేశాలను గుర్తించినట్లు తెలిపారు. ప్రతి కార్తీక మాసంలో వేలసంఖ్యలో పర్యాటకులు సందర్శించే తీర ప్రాంతంగా గుర్తింపు పొందిన రాజారాంపురాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని గతంలో స్థానికులు కోరిన మేరకు.. అధికారులు సందర్శించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా పట్టివేత

టెక్కలి రూరల్: మండలంలోని విక్రంపురం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను పోలీసులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు టెక్కలి ఎస్ఐ రామకృష్ణ శనివారం రాత్రి తన సిబ్బందితో వెళ్లి గ్రామంలో తనిఖీలు చేశారు. గ్రామానికి చెందిన మక్క గంగాధర్ అనే వ్యక్తి ఇంటిలో సుమారు రూ.4లక్షలు విలువ గల బాణసంచా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. గంగాధర్‌ను ప్రశ్నించగా గత ఏడాది ప్రభుత్వ అనుమతుల మేరకు బాణసంచా దుకాణం ఏర్పాటు చేశానని, మిగిలిన సరుకును ఇంటిలో ఉంచానని తెలిపారు. ప్రమాదకరమైన వస్తువులు ఇలా ఉంచడం చట్టరీత్యా నేరమని, బాణసంచాను సీజ్ చేసి కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

కొత్తూరు: కొత్తూరుకు చెందిన రాము(33) అనే వ్యక్తి శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాము ఇంటిలో ఓ శుభకార్యం జరగాల్సి ఉంది. అయితే ఆ కార్యం నిర్వహించేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో మనస్తాపం చెంది ఇంటిలో ఉన్న దూలానికి ఉరి వేసుకున్నట్లు ఎస్ఐ ఎం.గోవిందరావు తెలిపారు. మృతుడి భార్య నవీన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కేజీబీవీల్లో స్పోర్ట్స్ కోటా ద్వారా పలు పోస్టుల భర్తీ

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల(కేజీబీవీ)లో స్పోర్ట్స్ కేటగిరీలో కొన్ని పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్పోర్ట్స్ కోటా ద్వారా ప్రిన్సిపాల్, సీఆర్టీ గణితం, సీఆర్టీ బయలాజికల్ సైన్స్, సీఆర్టీ ఫిజికల్ సైన్స్, సీఆర్టీ ఇంగ్లిష్‌కు ఒక్కో పోస్టులను భర్తీ చేయాలని సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఉత్తర్వులు విడుదల చేశారని చెప్పారు. గుర్తింపు కలిగిన క్రీడాంశాల్లో ప్రపంచ స్థాయి, జాతీయస్థాయి, రాష్ట్రస్థాయి, ఆలిండియా యూనివర్సిటీ క్రీడా పోటీల్లో పతకాలు సాధించిన/ప్రాతినిధ్యం వహించిన మహిళలు ఈ నెల 24 నుంచి 26వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. నిష్ణాతులైన స్పోర్ట్స్ అధికారుల సమక్షంలో త్వరలో క్రీడా ప్రాతినిధ్యపు సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందన్నారు.

యూటీఎస్ మెషీన్ ప్రారంభం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం కాంప్లెక్స్‌లో శనివారం యునైటెడ్ టికెట్ సొల్యూషన్(యూటీఎస్) మెషీన్‌ను శ్రీకాకుళం ఆర్టీసీ ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం నుంచి విశాఖపట్టణం వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ఈ మెషీన్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రయాణికులకు చిల్లర సమస్య నుంచి తప్పించేందుకు ఈ మిషన్ ఉపయోగపడుతుందన్నారు. ప్రయాణికులు ఫోన్ పే, గూగుల్ పే, ఏటీఎం కార్డు ద్వారా ఈ మిషన్‌తో నగదు రహిత లావాదేవీలు నిర్వహించుకోవచ్చన్నారు. టికెట్ తీసుకోవడం సులభం చేసేందుకు దీన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఒకటో డిపో అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్, ఎస్ఎం కె.నరేంద్రబాబు, టీఐ–3 ఎల్ఎస్ నాయుడు, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంసిద్ధతే విపత్తు విజయ రహస్యం

- ప్రకృతి విపత్తులను ధైర్యంగా ఎదుర్కొంటున్నాం
- సీఎం నవీన్ పట్నాయక్



ముఖ్యమంత్రి అధ్యక్షతన వర్చువల్‌గా జరిగిన విపత్తు నిర్వహణ సమావేశం

భువనేశ్వర్: రాష్ట్రంలో తరుచూ సంభవిస్తున్న విపత్తులను సంసిద్ధత మరియు నిర్వహణతోనే విజయవంతంగా ఎదుర్కొంటున్నామని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అన్నారు. రాష్ట్రస్థాయి ప్రకృతి వైపరీత్యాల కమిటీ సమావేశంలో వర్చువల్‌గా శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది వరదలు, భారీ వర్షాల కారణంగా 24 జిల్లాలు దెబ్బతిన్నా, విపత్తుని విజయవంతంగా నిర్వహించడం విశేషమన్నారు. విపత్తుల సన్నద్ధత మరియు సమయోచిత నిర్వహణలో రాష్ట్రానికి జాతీయ స్థాయి గుర్తింపు సాధించిందన్నారు. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం 2023 సంవత్సరానికి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అవార్డును ప్రదానం చేసిందని తెలియజేశారు.

రైలు ప్రమాదం విషాదకరం

బాలాసోర్ జిల్లా బహనాగా బజార్ స్టేషన్ వద్ద జరిగిన ఘోర రైలు ప్రమాదం అత్యంత విషాదకరమని సీఎం నవీన్ పట్నాయక్ పేర్కొన్నారు. విపత్తు నిర్వహణలో కూడగట్టుకున్న విశేష అనుభవంతో రాష్ట్రం సత్వర కార్యాచరణతో ప్రమాదంలో చిక్కుకుపోయిన ప్రయాణికులను రక్షించిందన్నారు. అలాగే గాయపడిన వ్యక్తులను గ్రీన్ కారిడార్ ద్వారా ఆస్పత్రులకు తరలించి వందలాది మంది వైద్యులు మరియు పారామెడిక్స్‌ను సమీకరించి వేలాది మంది ప్రాణాలను కాపాడినట్లు వెల్లడించారు. ఏటా జూన్ నుంచి అక్టోబర్ వరకు రాష్ట్రంలో వరదలు లేదా తుఫాన్‌లు వంటి ప్రకృతి విపత్తులు ఉంటాయని, రాష్ట్రానికి ఈ వ్యవధి అత్యంత గడ్డుకాలమని పేర్కొన్నారు. వరదలను ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

24/7 కంట్రోల్ రూమ్

ప్రకృతి వైపరీత్యాల సమయంలో జిల్లా ప్రధాన కార్యాలయాలు, విభాగాల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటుకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. అమూల్యమైన మానవ ప్రాణాలను కాపాడేందుకు పౌరులకు అన్ని విపత్తులపై స్థానిక వాతావరణ ఆధారిత విపత్తు సమాచారాన్ని తెలియజేయడానికి సతర్క్ యాప్ దోహదపడుతుందన్నారు. విపత్తు నిర్వహణ దృష్ట్యా ఆహార సరఫరాలు మరియు వినియోగదారుల సంక్షేమ శాఖ తగినంత మొత్తంలో ఆహార పదార్థాలను నిల్వ చేస్తుందని పేర్కొన్నారు. పశువులను విపత్కర పరిస్థితుల్లో సకాలంలో సురక్షిత ప్రాంతాలకు తరలించే దిశలో యంత్రాంగం అప్రమత్తం కావాలని సూచించారు. ఈ నేపథ్యంలో పశువుల సంరక్షణకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తారు. సహాయక పునరుద్ధరణ చర్యల్లో గర్భిణీ స్త్రీలు, శారీరక, మానసిక వికలాంగులు, చిన్నపిల్లలు, వృద్ధుల వంటి బలహీన వ్యక్తులపై కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహిస్తారని తెలిపారు. విపత్తు సంభవిస్తే తక్షణమే సహాయక, పునరుద్ధరణ, పునర్నిర్మాణ కార్యకలాపాలకు అనుబంధ యంత్రాంగం అన్ని వర్గాలు రంగంలోకి దిగాల్సి ఉంటుందన్నారు.

జగన్నాథునికి ప్రత్యేక పూజలు

- వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనం




జయపురం: వరహావతారంలో భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు



బరంపురం: పాతలేశ్వార్‌లో వరాహావతారంలో భక్తులకు దర్శనమిచ్చిన జగన్నాథ స్వామి



పర్లాకిమిడి: వరాహావతారంలో జగన్నాథ స్వామివారు



పర్లాకిమిడి: నృసింహావతారంలో భక్తులకు దర్శనమిస్తున్న జగన్నాథుడు



రాయగడ: ఉగ్రనరసింహుని రూపంలో జగన్నాథుడు

రాయగడ:

హీరా పంచమి సందర్భంగా గుండిచా మందిరంలో కొలువైవున్న జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవతామూర్తులను శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దేవతామూర్తులకు పప్పు, బియ్యం, తోటకూర వంటివి సమర్పించుకున్నారు. ఇదిలాఉండగా పవిత్ర పంచమి నాడు జగన్నాథుడు ఉగ్ర నరసింహుని రూపంలో భక్తులకు దర్శనమిచ్చాడు. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

పర్లాకిమిడి: స్థానిక గుండిచా మందిరంలో జగన్నాథుడు వరాహ, నృసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. సహధర్మచారిని శ్రీమహాలక్ష్మిని గుండిచా యాత్రకు పిలువలేదని కోపంతో గుండిచా మందిరానికి వెళ్లి అక్కడున్న జగన్నాథ రథాన్ని కాళితో తన్నిన ఈ ఘట్టాన్ని సేవాయత్‌లు ఉదయం సాంప్రదాయ నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున గుండిచాకు రావడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బరంపురం: నగరంలో గత 5 రోజులుగా వివిధ ప్రదేశాల్లో జరుగుతున్న రథయాత్ర ఉత్సవాలు అంబరాన్ని తాకుతున్నాయి. తాత్కాలిక గుండిచా మందిరంలో కొలువున్న జగన్నాథ స్వామివారు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. స్వామివారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని, పూజలు నిర్వహిస్తున్నారు.

జయపురం: స్థానిక గుండిచా మందిరంలో శుక్రవారం రాత్రి భక్తులకు దేవతామూర్తి జగన్నాథుడు వరహావతారంలో దర్శనమిచ్చాడు. భక్తులకు ప్రతిరోజూ ఒక్కొక్క అవతారంలో స్వామివారు దర్శనమిస్తున్నారు.

పారిశుద్ధ్య పనులు



దేవతామూర్తుల పూజా సామాన్లు పరిశుభ్రం చేస్తున్న మహిళలు

జయపురం: స్థానిక గుండిచా మందిరం వద్ద శ్రీరామ మందిర సేవాదళ్ కార్యకర్తలు పారిశుద్ధ్య కార్యక్రమాలు స్వచ్ఛందంగా చేపడుతున్నారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సేవాదళ్ కార్యకర్తలు గుండిచా మందిర పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేయడంతో పాటు దేవతామూర్తుల పూజా సామగ్రి శుభ్రం చేయడం తదితర పనులు నిర్వహిస్తున్నారు. కార్యక్రమాల్లో శ్రీరామ మందిర సేవాదళ్ కార్యదర్శి సానా జగదీష్, జి.రమణ, వారణాసి సత్యనారాయణ, ఎ.తిరుమల రావు, ఎస్.ఈశ్వరరావు, వరాలరావు, బి.వెంకట రమణ, బాబూరావు, వి.శవారావు, ఎస్.మల్లు, సీహెచ్ సోమశేఖర్, ఎస్.పుండరి, గుడ్ల రామారావు తదితరులు పాల్గొంటున్నారు.



మందిర పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపడుతున్న సేవాదళ్ సభ్యులు

చురుగ్గా వెండి తాపడం పనులు



వెండి తాపడం పనులు నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: శ్రీమందిరం సింహద్వారం వెండి తాపడం పనులు చురుగ్గా సాగుతున్నాయి. వెండి తాపడం తలుపులు అమర్చేందుకు ద్వారం పనులు శుక్రవారం అర్ధరాత్రితో ముగిశాయి. ముంబై నుంచి రప్పించిన 13 మంది కార్మికులు ఈ పనుల్లో నిమగ్నమయ్యారు. నీలాద్రి భక్తి నివాసం ప్రాంగణంలో కొత్త తలుపులకు వెండి తాపడం పనులు చేపడుతున్నారు. ఈ పనులు దాదాపు తుది దశకు చేరుకున్నాయి. ద్వారానికి తలుపులు అమర్చిన తర్వాత సింహం ఇతర నమూనాలు ఆలయ సంప్రదాయం ప్రకారం తలుపులకు అలంకరిస్తారు. ముంబైకి చెందిన ఒక దాత సింహద్వారం నిర్మాణానికి బర్మా టేకు మరియు వెండి విరాళంగా అందజేశారు. ముంబైకి చెందిన 13 మంది కలప పనుల కార్మికుల ప్రత్యక్ష పర్యవేక్షణలో నీలాద్రి భక్తి నివాసం ప్రాంగణంలో కొత్త తలుపుల చెక్కలు వగైరా సామగ్రికి గట్టి భద్రత కల్పించారు. వీరి పర్యవేక్షణలో తలుపుల తాపడానికి వెండి రేకుల కోత ఇతరేతర పనులు పూర్తి చేశారు. ద్వారానికి తలుపులు అమర్చే పనులు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పనులు పురస్కరించుకుని ఈనెల 21వ తేదీన సింహద్వారం పాత తలుపును తొలగించి తాత్కాలిక ద్వారం ఏర్పాటు చేశారు. కొత్త ద్వారం అమర్చిన తర్వాత ఈ తాత్కాలిక ద్వారం తొలగించబడుతుంది.

ఆర్టీసీ దూర ప్రాంత ప్రయాణికులకు రాయితీ



జిల్లా ప్రజా రవాణా అధికారి విజయ్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో దూరప్రాంతాలకు ప్రయాణం చేసేవారికి టిక్కెట్ ధరలో రాయితీ ఇస్తున్నట్లు శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ కుమార్ తెలిపారు. శనివారం శ్రీకాకుళంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతి వంటి దూరప్రాంతాలకు ప్రయాణించే వారు ముందుగా రాను, పోను టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకుంటే టిక్కెట్ చార్జీలపై రాను 10 శాతం, పోను 10 శాతం రాయితీ లభిస్తుందన్నారు. గతంలో కేవలం తిరిగి వచ్చేటప్పుడు మాత్రమే పది శాతం రాయితీ వచ్చేదన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే జూలై 3వ తేదీన గురు పౌర్ణమి సందర్భంగా శ్రీకాకుళం నుంచి అరుణాచలం వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్ సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. జూలై 1వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు బస్సు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బయలుదేరి 2వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్, కంచి దర్శించుకుని అదే రోజు రాత్రి అక్కడ నుంచి బయల్దేరి 3వ తేదీ ఉదయం అరుణాచలం చేరుతుందని అన్నారు. అరుణాచల గిరి ప్రదక్షిణ, దర్శనం అనంతరం మళ్లీ సాయంత్రం బయల్దేరి 4వ తేదీ సాయంత్రానికి శ్రీకాకుళం చేరుకుంటుందని తెలిపారు. ఈ యాత్రకు సంబంధించి ఒక్కో ప్రయాణికుడికి ప్రయాణ చార్జీ రూ.4500 గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. టికెట్లు కావాల్సిన వారు శ్రీకాకుళం బస్ స్టేషన్‌లో గల రిజర్వేషన్ కౌంటర్ ద్వారా లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఆర్‌టీసీఆన్‌లైన్.కాం ద్వారా కొనుగోలు చేయవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు 7382921647, 9959225608, 9959225609, 7382917289, 7382919694 తదితర ఫోన్ నంబర్లను సంప్రదించగలరని పేర్కొన్నారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం-1, 2 డిపోల మేనేజర్లు కె.మాధవ్, కె.ఎస్.ఆర్.శర్మ, అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌లు ఎస్. సిమ్మయ్య, యల్.యస్.నాయుడు తదితరులు ఉన్నారు.

జాతీయ ఉషూ పోటీలకు ఇద్దరు ఎంపిక



చీఫ్ కోచ్ శ్రీధర్‌రావు, ఉషూ సంఘ ప్రతినిధులతో శిరీష, ధనుంజయ

శ్రీకాకుళం న్యూకాలనీ: గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి స్థాయి పోటీల్లో సీనియర్ విభాగంలో ముద్దాడ శిరీష (65 కేజీల కేటగిరి), బైరి ధనుంజయరావు(56 కేజీల కేటగిరి) బంగారు పతకాలు సాధించడంతో 32వ సీనియర్స్ జాతీయ ఉషూ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు పూణే వేదికగా ఈనెల 26 నుండి జూలై 1వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకుగాను పూణే పయనమైన క్రీడాకారులను శనివారం ఉదయం స్థానిక కోడి రామ్మూర్తి క్రీడ ప్రాంగణంలో వీడ్కోలు పలికారు.

జాతీయ స్థాయి ఉషూ పోటీల్లో రాణించి జిల్లా కీర్తి ప్రతిష్టలను చాటిచెప్పాలని శ్రీకాకుళం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ డాక్టర్ కల్లేపల్లి శ్రీధర్‌రావు పిలుపునిచ్చారు. క్రీడాకారులను తీర్చిదిద్దుతున్న ఉషూ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, చీఫ్ కోచ్ రెడ్డి శివకుమార్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఉషూ అసోసియేషన్ ప్రతినిధి కురిటి తారకరామ, కొమర భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

యంత్రంతో వరి వెద సాగు బాగు



విత్తనం, ఎరువులు వేసే యంత్రంతో వెద సాగు విధానంపై అవగాహనలో పాల్గొన్న రైతులు

గార: ఆధునిక యంత్రంతో వరి ఎద సాగు పద్ధతి లాభదాయకమని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని చినవాడాడ గ్రామంలో శనివారం ఆధునిక (ఫెర్టికమ్ సీడ్ డ్రిల్) యంత్రంతో ఎద సాగు విత్తనాలు, ఎరువులు వేసే విధానంపై డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో క్షేత్ర ప్రదర్శన జరిగింది. ఆయన మాట్లాడుతూ మారిన వాతావరణ పరిస్థితులు, వర్షాధారంగా లభిస్తున్న తక్కువ నీటితో లాభదాయక దిగుబడి సాధించాలంటే వరిలో ఎద సాగు మంచిదని, అదే సమయంలో యంత్రంతో వేయడం వల్ల సమయంతో పాటు ఒకే సారి ఎరువులు కూడా వేయవచ్చన్నారు. ఇటీవల కాలంలో కూలీల రేట్లు అధికం కావడం వల్ల వరి సాగు చేసే రైతులు నారుమడి నుంచి నారు తీసి దమ్ము చేసి ఉభాలు వేయడం కష్టతరంగా మారిందన్నారు. ఎకరాకు 16 కిలోల శుద్ధి చేసిన విత్తనాన్ని నేరుగా చదును చేసిన పొలంలో ట్రాక్టర్‌తో నడిచిన ఎరువులు, విత్తనం వేసే మిషన్ ద్వారా విత్తుకోవచ్చన్నారు. కూడా 2.5 నుంచి 5 సెంటీమీటర్ల లోతులో విత్తనం పడేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు, సమన్వయకర్తలు ఎన్.వెంకటరావు, రైతు మిత్రులు ఎల్.అప్పలనాయుడు, డి.ప్రభాకర్, ఆర్. అప్పలనాయుడు రైతులు పాల్గొన్నారు.

'పద్మ' అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం


శ్రీకాకుళం న్యూకాలనీ: మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ భారత ప్రభుత్వం వారు 2024 ఏడాదికి గాను పద్మ అవార్డుల (పద్మవిభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ) కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి నామినేషన్లను ఆహ్వానిస్తున్నట్టు సెట్‌శ్రీ సీఈఓ బీవీ ప్రసాదరావు తెలిపారు. వివిధ రంగాల్లో పాల్గొనడమే కాకుండా ఆయా రంగాల్లో విశిష్టమైన సేవలు అందించిన వ్య క్తులు జూలై 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కళలు (ఆర్ట్స్), సామాజిక అండ్ సాంఘిక సేవ (సోషల్‌వర్క్), ప్రజా సంబంధాలు (పబ్లిక్ అఫైర్స్), సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, వైద్యం (మెడిసిన్), పాండిత్యం, విద్య (లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్), సివిల్ సర్వీసెస్, క్రీడలు (స్పోర్ట్స్), తదితర రంగాల్లో ఉత్తమ సేవలు కనబర్చిన వారి నుంచి నామినేషన్లను ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. అవార్డ్స్.జీవోవి.ఇన్ వెబ్‌పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకుని దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆ దరఖాస్తు కాపీ ప్రతిని జిల్లా కలక్టరేట్ ప్రాంగణంలో ఉన్న సెట్‌శ్రీ కార్యాలయంలో ఈనెల 10వ తేదీలోపు అందజేయాలని ప్రసాదరావు సూచించారు. కేవలం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో మాత్రమే చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. మరిన్ని వివరాలకు కార్యాలయపు పనివేళల్లో సెట్ శ్రీ మేనేజర్ వీవీ అప్పలనాయుడు (94418 99549)ను సంప్రదించాలని ఆయన కోరారు.

'డీఈఓ తీరు సరికాదు'

ఆమదాలవలస రూరల్: జిల్లాలో ఉపాధ్యాయ బదిలీల్లో అవకతవకలు జరిగాయని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు పడాల తమ్మినాయుడు, ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమణమూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేడాడ ప్రభాకరరావు శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. డీఈఓ తీరు వల్ల వందలాది మంది అమాయక ఉపాధ్యాయులు బలైపోయారని ఆరోపించారు. టీచర్లు చేతిలో బదిలీల ఉత్తర్వులు పట్టుకుని మండల విద్యాశాఖ, జిల్లా విద్యాశాఖ కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మార్గదర్శకాలు ఇచ్చినా డీఈఓ ఏమరపాటు వల్ల సమస్యలు తప్పడం లేదని పేర్కొన్నారు.

గంజాయి ముఠాలపై ఉక్కుపాదం

- ఎస్పీ జీఆర్ రాధిక
- ఇచ్ఛాపురంలో 46.5 కిలోల గంజాయి పట్టివేత



పట్టుకున్న గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

ఇచ్ఛాపురం: గంజాయి ముఠాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఇచ్ఛాపురంలో శనివారం మళ్లీ దాడులు చేసి గంజాయి అక్రమ రవాణాను అడ్డుకున్నారు. పట్టుకున్న గంజాయిని శనివారం ఎస్పీ జీఆర్ రాధిక పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో గంజాయి రవాణా, నాటుసారా తయారీపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. వీటి నివారణ కోసం పరివర్తన-2లో భాగంగా చెక్‌పోస్టుల వద్ద గస్తీ పెంచామని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాలు తనిఖీ చేయడంతో పాటు పాత గంజాయి వ్యాపారులు, రౌడీ షీటర్లపై నిఘా ఉంచామని అన్నారు. రెండు రోజుల కిందట పురుషోత్తపురం చెక్ పోస్ట్ వద్ద 101 కిలోల గంజాయి పట్టుబడిందని, అలాగే శనివారం ఇచ్ఛాపురం పాత టోల్ ప్లాజా వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పురుషోత్తపురం గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలతో పాటు ఒక రౌడీషీటర్, తమిళనాడుకు చెందిన ఆరుగురు వ్యాపారులు గంజాయి రవాణా చేస్తూ దొరికిపోయారని తెలిపారు. వారి వద్ద నుంచి 46.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే 9 సెల్‌ఫోన్‌లు, ఒక స్కూటీ సీజ్ చేశామన్నారు. అరెస్టు చేసిన వారిలో ఒకరు మైనర్ అని చెప్పారు. ఒడిశా నుంచి లారీ డ్రైవర్ల ద్వారా గంజాయి వస్తున్నట్లు గుర్తించామని, వీటిపై దృష్టి పెట్టి ఇప్పటికే 66 మంది ప్రైవేట్ వెహికల్ ట్రాన్స్‌పోర్ట్, 66 మంది లాడ్జీ ఓనర్లకు నోటీసులిచ్చామన్నారు. జిల్లా వ్యాప్తంగా 14500 టోల్ ఫ్రీ నంబర్‌తో అవగాహన కూడా కల్పిస్తున్నామన్నారు. చాకచక్యంగా వ్యవహరించి గంజాయి ముఠాను పట్టుకున్న సీఐ ఈశ్వర్ చంద్రప్రసాద్, టౌన్ ఎస్సై కూన గోవిందరావు, సిబ్బందిని అభినందించారు. ఈ సమావేశంలో కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరావు ఉన్నారు.

క్లుప్తంగా

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

విజయనగరం పూల్‌బాగ్: విజయనగరం పూల్‌బాగ్‌లోని అయ్యప్పనగర్‌లో మోడల్ స్కూల్‌లో 7, 8, 9 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రుక్సానా పర్వీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు నేరుగా పాఠశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. తదుపరి పాఠశాల విద్యా కమిషనర్ ఉత్తర్వుల మేరకు పరీక్ష నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: పార్వతీపురం మన్యం జిల్లాలో ఖాళీగా ఉన్న జిల్లా క్వాలిటీ మోనటిర్ పోస్టుకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 30లోగా విజయనగరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తులను విజయనగరం.ఎన్‌ఐసి. ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్హతలు నకలు కాపీలు గజిటెడ్ ఆఫీసర్‌తో తప్పనిసరిగా సంతకం చేయించాలని సూచించారు.

ఆటోను ఢీకొన్న కారు

● ఐదుగురికి గాయాలు


తీవ్రంగా గాయపడిన షేక్ షాంబి

గజపతినగరం రూరల్: మండలంలోని మరుపల్లి సమీపంలో శుక్రవారం రాత్రి ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు మహిళా కార్మికులు గాయాల పాలయ్యారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళ్తే... ఓలం కంపెనీలో విధులు ముగించుకుని ఐదుగురు మహిళా కార్మికులు ఆటోలో బయలుదేరగా సాలూరు నుంచి వస్తున్న కారు మరుపల్లి సమీపంలో బలంగా ఢీకొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న షేక్ షాంబి, ఎండపిల్లి విజయ, శ్రీదేవి, పి.రమాదేవి, ఆర్.రామయ్యమ్మ గాయపడ్డారు. వీరిలో షేక్ షాంబికి తీవ్ర గాయాలయ్యాయి. ఈమెను జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ గంగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఎస్టీ బోగస్ కుల ధ్రువీకరణ పత్రాలపై విచారణ


ఎస్టీ బోగస్ కుల ధ్రువీకరణ పత్రాలపై విచారణ చేస్తున్న పీవో కల్పనాకుమారి

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో ఎస్టీ బోగస్ కుల ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగాలు చేస్తున్న వారిపై ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి ఆధ్వర్యంలో శనివారం విచారణ చేపట్టారు. ఈ మేరకు డీఎల్ఎస్‌సీ సమావేశం ఏర్పాటు చేశారు. బీసీ వెల్ఫేర్‌లో హెచ్‌డబ్ల్యూవోగా పనిచేసి రిటైర్ అయిన కుమార్‌స్వామి, రైల్వే ఉద్యోగి గెద్దయ్ సన్యాసిరావు, బీటెక్ విద్యార్థిని శాలినీ జొలై, కె.శ్రీనివాసరావు, పీడీ మాధవరావుపై విచారణ జరిపారు. మొత్తం 5 కేసులను విచారించగా 4 కేసులు పూర్తి చేయడానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. మిగిలిన కేసు జూలై 1వ తేదీకి వాయిదా వేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో రోసిరెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ డీడీ శ్రీనివాసరావు, డీటీ కుమారి, తహసీల్దార్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

లక్కవరపుకోట : భూ వివాదంలో నలుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఎం.ముకుందరావు తెలిపారు. దీనికి సంబంధించి ఎస్‌ఐ తెలిపిన వివరాలు.. మండలంలోని రెల్లిగౌరమ్మపేట గ్రామానికి చెందిన పినిశెట్టి కిష్టప్పదొరకు శ్రీరాంపురం గ్రామ రెవెన్యూ పరిధిలో కొంత భూమిలో మామిడి తోట ఉంది. ఈ భూమిలోకి అదే గ్రామానికి చెందిన తుంపాల అప్పన్నదొర, తుంపాల లక్ష్మి, ఏడువాక అప్పలనారాయణ, ముచ్చకర్ల శ్రీను చొరబడి ఆక్రమించేందుకు యత్నించారు. దీన్ని అడ్డుకున్న కిష్టప్పదొరపై పై నలుగురు దాడి చేశారు. కిష్టప్పదొర ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఎస్‌డబ్ల్యూపీసీ తనిఖీ

తెర్లాం: మండల కేంద్రమైన తెర్లాంలోని చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాన్ని(ఎస్‌డబ్ల్యూపీసీ) మండల ప్రత్యేకాధికారి వి.లక్ష్మణరావు, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, ఈఓపీఆర్‌డీ రాంబాబు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు మాట్లాడుతూ, కేంద్రంలో వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేసి రైతులకు విక్రయించి ఆదాయం సమకూర్చుకోవాలని సూచించారు.

వెబ్‌సైట్‌లో మార్కుల జాబితా

విజయనగరం అర్బన్: జిల్లా రెవెన్యూశాఖలో జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షకు సంబంధించిన అభ్యర్థుల మార్కుల జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచామని డీఆర్వో ఎం.గణపతిరావు తెలిపారు. 2021 డిసెంబర్ 28న విడుదల చేసిన నోటిఫికేషన్‌కు సంబంధించిన పరీక్ష ఫలితాలు 'విజయనగరం.ఏపీ.జీఓవి.ఐఎన్'లో చూసుకోవచ్చన్నారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

● నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ ఎం.దీపిక


నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక


ఎస్‌ఐ వాసుదేవ్‌కు ప్రశంసపత్రం అందజేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: రౌడీషీట్లు కలిగిన వ్యక్తుల నేర ప్రవృత్తి, జీవనశైలిపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఎస్పీ ఎం.దీపిక అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు అధికారులతో మాసాంతర నేర సమీక్ష సమావేశాన్ని జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. వివిధ పోలీసుస్టేషన్లలో రౌడీషీట్లు కలిగిన వ్యక్తులు ఇంతవరకూ ఏయే నేరాలకు పాల్పడ్డారు, వివిధ పోలీసుస్టేషన్లలో నమోదైన కేసులు ఏ స్థాయిలో ఉన్నాయి? ప్రస్తుతం ఆ వ్యక్తుల నేరప్రవృత్తి, ప్రవర్తన, జీవనశైలి గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రౌడీషీట్లు తెరవబడి, సత్ప్రవర్తన కలిగి, నేర ప్రవృత్తికి స్వస్తి పలికి, సామాన్య జీవనం సాగిస్తూ, భవిష్యత్తులో ఎటువంటి నేరాలకు పాల్పడ్డారన్న వ్యక్తుల షీట్లను డీఎస్పీ స్థాయి అధికారులు ఒకసారి సమీక్షించి, వాటిని మూసి వేయాలన్నారు. మత్తు పదార్థాల నియంత్రణ, రవాణాను అరికట్టి, విద్యార్థులు, యువతకు మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలను వివరించేందుకు హోర్డింగ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. జగనన్నకు చెబుదాం వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిచ్చి, నిర్దిష్ట సమయంలోగా చర్యలు చేపట్టి, వివరాలు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం ఎస్పీ గ్రేవ్ కేసులను, కోర్టుల్లో అభియోగ పత్రాలు దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రతిభ కనబర్చిన అధికారులకు ప్రశంసపత్రాలు

బుదరాయవలస పీఎస్‌లో నమోదైన సైబర్ నేరంలో నిందితుడ్ని అరెస్టు చేసి, పోయిన నగదులో రూ.8.64 లక్షలు రికవరీ చేయడంలో మంచి ప్రతిభ కనబర్చిన ఎస్‌ఐ సిహెచ్.నవీన్ పడాల్‌ను ఎస్పీ ఎం.దీపిక ప్రత్యేకంగా అభినందించి, జ్ఞాపికను ప్రశంసపత్రంను అందజేశారు. అదేవిధంగా విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చి, గతనెలలో నమోదైన కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తిచేయడంలోనూ, పోయిన ఆస్తులను రికవరీ చేసినందుకు గంజాయి, అక్రమ రవాణా ను నియంత్రించి, ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు చీపురుపల్లి సీఐ జి.సంజీవరావు, బొండపల్లి ఎస్‌ఐ ఎస్.రవి, సీసీఎస్ ఎస్‌ఐ ఎస్.సుదర్శన్, డీసీఆర్‌బీ ఎస్‌ఐ ఆర్.వాసుదేవ్, ఏఎస్‌ఐ ఎ.గౌరీశంకర్, హెచ్‌సీ జి.జనార్దనరావు, కానిస్టేబుళ్లు జి.లావణ్య, టి. అప్పలనాయుడు, జి.దాసు, కె.రమేష్, ఎం.మురళి, ఎన్.రవికుమార్, జి.గౌరీశంకర్, హోంగార్డ్ ఎం.సురేష్‌లను ఎస్పీ అభినందించి, ప్రశంసపత్రాలను ప్రదానం చేశారు. సమావేశంలో విజయనగర డీఎస్పీ ఆర్.గోవిందరావు, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీధర్, ట్రాఫిక్ డీఎస్పీ డి.విశ్వనాథ్, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, డీటీసీ డీఎస్పీ వీరకుమార్, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, న్యాయసలహాదారులు వై.పరశురాం, డీపీఓ ఏఓ వెంకటరమణ, సీఐలు, ఎస్‌ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్వారీ కార్మికుడి దుర్మరణం


క్వారీలో మృతి చెందిన కార్మికుడు

వేపాడ: మండలంలోని సోంపురం పంచాయతీకి చెందిన నర్సిపల్లి మెట్టపై క్వారీ పని చేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తు కిందకు జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనికి సంబంధించి తోటి కార్మికులు తెలిపిన వివరాలు... అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పోలీగూడ గ్రామానికి చెందిన గెమ్మెల బుద్దు(30) రోజూలాగే శనివారం క్వారీ పనికి వెళ్లాడు. పని చేస్తుండగా కాలు జారి మెట్ట పైనుంచి కింద రాళ్ల గుట్టపై పడిపోయాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వల్లంపూడి ఎస్‌ఐ రాజేష్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా కార్మికుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న సీఐటీయూ జిల్లా నాయకుడు చల్లా జగన్ సంఘటనా స్థలానికి చేరుకొని కార్మికులతో కలిసి ఆందోళన చేశారు. మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలని, పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

లారీ ఢీకొని మహిళ మృతి


సంఘటనా స్థలంలోనే మృతి చెందిన సునీత

విజయనగరం క్రైమ్: లారీ ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి టుటౌన్ పోలీసులు శనివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక రింగురోడ్డు టౌన్ సెంటర్ లేఅవుట్‌లో నివాసం ఉంటున్న సోమయాజుల సునీత (39) జమ్ము నారాయణపురంలో ఉన్న ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తున్నారు. మధ్యాహ్నం ఇంటికి వెళ్లి లంచ్ చేసి తిరిగి జమ్మునారాయణపురంలో ఉన్న స్కూల్‌కి స్కూటీపై వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈమె భర్త కిశోర్ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నారు. వీరికి ఇద్దరు ఆడ పిల్లలున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు టు టౌన్ ఎస్‌ఐ షేక్ శంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాణ్యతగా రామతీర్థం ఆలయ అభివృద్ధి పనులు

● ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు


రామతీర్థంలో శాశ్వత యాగశాల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో అభివృద్ధి పనులు నాణ్యతగా చేపట్టాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆదేశించారు. రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో అతి పెద్ద దైవ క్షేత్రమైన రామతీర్థం అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తున్నామని చెప్పారు. దేవదాయ శాఖ మంత్రి, ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపి ఆలయంలో ఫ్లోరింగ్, శాశ్వత యాగశాల నిర్మాణం, ఉత్తర రాజగోపురం వద్ద అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యేలా చూశామన్నారు. రూ.కోటి నిధులతో అభివృద్ధి పనులు జరగడం శుభ పరిణామమన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఆగమ శాస్త్రం ప్రకారం యాగశాల నిర్మాణం పూర్తి కావాలని ఈఓ కిషోర్‌కుమార్‌కు సూచించారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ముఖ్యంగా భక్తులు నడిచేందుకు ఇబ్బందులు లేకుండా ఫ్లోరింగ్ నిర్మాణ పనులు జరగాలని ఆదేశించారు. బోడికొండపై ఇప్పటికే కోదండ రామాలయ నిర్మాణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. కార్యక్రమంలో ఈఓ కిషోర్‌కుమార్, శివాలయ అర్చకులు మల్లికార్జున శర్మ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబు వీరంగం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు

రాజాం సిటీ: రాజాంలో మందుబాబుల వీరంగం అధికమైంది. పగలు రాత్రి తేడా లేకుండా ఇష్టానుసారంగా మద్యం సేవించి అల్లర్లకు పాల్పడుతున్నారు. ఇటీవల మందుబాబుల వీరంగం పట్టణంలో అధికమైంది. నెల రోజుల క్రితం రాత్రివేళ అంబేడ్కర్ కూడలిలో వాహనదారులపై మందుబాబుల వీరంగం సృష్టించిన విషయం విదితమే. ఆ ఘటన మరువకముందే శనివారం మరో ఘటన చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలను ఎస్‌ఐ బీవీ రామకృష్ణ తెలిపారు. సంకతవిటి మండలం తాలాడ గ్రామానికి చెందిన ఉమ్మడివరపు చంద్రరావు, అతని భార్య శైలజ రాజాం పనిపై వచ్చారు. బస్టాండ్ ఔట్ గేటు వద్దకు వచ్చేసరికి బలిజిపేట మండలం తుమరాడ గ్రామానికి చెందిన హేమల దేవరాజు పూటుగా మద్యం సేవించి వారి వాహనానికి అడ్డంగా వచ్చాడు. ఎందుకు అడ్డంగా వచ్చావని సదరు వ్యక్తిని చంద్రరావు అడగడంతో తన చేతిలో ఉన్న బీరు సీసాతో దాడి చేశాడు. వెంటనే చంద్రరావు పక్కకు తప్పుకోవడంతో అడ్డుపడిన తన భార్య శైలజ చేతికి సీసా తగిలి గాయాలయ్యాయి. దాడికి పాల్పడిన వ్యక్తిని స్థానికులు పోలీసులకు అప్పగించి బాధితురాలిని రాజాం సామాజిక ఆస్పత్రిలో చేర్పించి చికిత్స నందించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా పట్టపగలు ఇలా మందుబాబులు వీరంగం చేస్తుండడంతో పట్టణ వాసులు, కళాశాల విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. పోలీసులు నిఘా ఏర్పాటు చేసి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారితో పాటు వీరంగం సృష్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

26న తైక్వాండో క్రీడాకారుల ఎంపిక పోటీలు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న కేడెట్, జూనియర్స్ విభాగాల తైక్వాండో పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 26న నిర్వహించనున్నట్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డి.వి.చారిప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు నగరంలోని కొత్తపేట ప్రాంతంలోని రాధాకృష్ణ కళ్యాణమండపం ఆవరణలో ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. జూనియర్ విభాగంలో అర్హత సాధించిన క్రీడాకారులు వచ్చే నెల 1,2 తేదీల్లో చిత్తూరు జిల్లాలో, కేడెట్ విభాగంలో అర్హత సాధించిన క్రీడాకారులు విజయనగరం జిల్లాలో 15,16,17 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిథ్యం వహిస్తారని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఆ రోజు ఉదయం 9 గంటలకు ఎంపిక పోటీలు జరిగే వేదిక వద్దకు ఆధార్‌కార్డు జిరాక్స్‌తో హాజరుకావాలని సూచించారు.

సెప్టెంబర్ నాటికి నిర్మాణాలు పూర్తి కావాలి


కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: నాడు నేడు కింద చేపడుతున్న భవన నిర్మాణాలన్నీ వచ్చే సెప్టెంబర్ నెలాఖరుకు పూర్తి కావాలని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. వెబెక్స్ ద్వారా ఎంపీడీఓలు, ఎంఈఓలు, డీఈలు, ఏఈలతో నాడు నేడు పనుల పురోగతిపై కలెక్టర్ మండలాల వారీగా శనివారం సమీక్షించారు. గత సమీక్ష 15 రోజుల క్రితం జరిగిందని ఈ 15 రోజుల్లో కొన్ని మండలాల్లో 50 శాతం కంటే తక్కువ పురోగతి కనబడుతోందని వారికి షోకాజ్ నోటీస్ జారీ చేస్తున్నామని అన్నారు. గత సమావేశంలో 77 స్టేజ్ మార్పులను లక్ష్యంగా నిర్ణయించగా 54 మాత్రమే స్టేజ్ మార్పులు జరిగాయని, తక్కువ చేసిన వారికి కారణాలతో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఇప్పటికే పూర్తయిన భవనాలను జూన్ 30 నాటికి ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రారంభించిన వెంటనే వినియోగించేలా ఉండాలన్నారు. మిగిలిన భవనాలను జూన్ 15 నాటికి తప్పకుండా స్టేజ్ మార్పు జరగాలన్నారు. నిధుల సమస్య లేదని, పనులు వేగంగా జరిగేలా చూడాలన్నారు. లక్ష్యాలను సాధించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

యువకుడిపై అట్రాసిటీ కేసు

సాలూరు: ఎస్సీ మహిళను నమ్మించి మోసం చేసిన కేసులో పార్వతీపురానికి చెందిన యువకుడు నవీన్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. పట్టణంలో చినవీధికి చెందిన ఓ వితంతువు తనను నవీన్ నమ్మించి మోసం చేసినట్టు ఫిర్యాదు చేసిందని చెప్పారు. అందిన ఫిర్యాదు మేరకు నవీన్‌పై అట్రాసిటీతో పాటు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామని తెలిపారు. దీనిపై ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ మురళీకృష్ణ విచారణ చేపట్టారు.

విద్యాహక్కు చట్టంపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబు

రాజాం సిటీ: విద్యాహక్కు చట్టంపై విద్యార్థులకు అవగాహన అవసరమని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు అన్నారు. స్థానిక జ్ఞానజ్యోతి విద్యాలయంలో మండల న్యాయసేవాధికార సంఘం ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ద్వారా 6–14 ఏళ్ల మధ్య వయసు కలిగిన పిల్లలకు ఉచిత విద్య అందుబాటులో ఉందన్నారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, జీవితంలో ఎన్నో నైతిక విలువలు విద్య ద్వారా నేర్చుకోవచ్చన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, న్యాయవాదులు రెడ్డి విజయ్‌కుమార్, ముదిలి శ్రీనివాసరావు, చల్లా శ్యాంప్రసాద్, ఎస్‌ఐ వీబీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన రాజన్నదొర

సాక్షి ప్రతినిధి, విజయనగరం: టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి వై.వి.సుబ్బారెడ్డిని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర విశాఖపట్నంలోని సర్క్యూట్ గెస్ట్‌హౌస్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్వతీపురం జిల్లాలో నియోజకవర్గాల వారీగా పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుపై సమీక్షించారు. ఈ నెల 28న కురుపాంలో జరిగే అమ్మఒడి పథకం ప్రారంభ కార్యక్రమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లపై చర్చించారు.

కాపర్ పైపుల దొంగల అరెస్ట్


వివరాలను వెల్లడిస్తున్న సీఐ

● 2.5లక్షల విలువ గల పైపులు, తులం బంగారు ఆభరణాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న కాపర్ పైపులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి ఫేకర్ పరిశ్రమలో కొన్ని రోజుల క్రితం జరిగిన కాపర్ పైపుల చోరీ కేసుకు సంబంధించి దొంగలను గరివిడి ఎస్‌ఐ ఎల్.దామోదరరావు ఆధ్వర్యంలో పోలీసుల బృందం అరెస్ట్ చేసింది. దీనికి సంబంధించిన వివరాలను సీఐ జి.సంజీవరావు గరివిడి పోలీస్‌స్టేషన్‌లో శనివారం వెల్లడించారు. ఫేకర్‌లో కొద్ది రోజుల కిందట కాపర్ పైపుల చోరీకి గురైనట్టు ఫిర్యాదు అందిందని, ఈ మేరకు డీఎస్పీ చక్రవర్తి ఆదేశాలతో తామంతా బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టామన్నారు. డీఎఫ్ఎన్ సమీపంలోని దేవాడ జంక్షన్ వద్ద నిందితులను పట్టుకుని అరెస్టు చేశామని చెప్పారు. గరివిడిలో కొండపాలేం ప్రాంతానికి చెందిన గండ్రేటి శంకర్, కొండపర్తి దుర్గారావు, టీచర్స్ కాలనీకి చెందిన గడపర్తి గిరిబాబు, లావేటి సాయికుమార్, పాత గరివిడికి చెందిన గురాన దుర్గాప్రసాద్, జెట్టిపు క్వార్టర్స్ ప్రాంతానికి చెందిన రోహితకుమార్ సింగ్‌లను పట్టుకుని విచారణ చేయగా దొంగతనం చేసినట్టు అంగీకరించారని తెలిపారు. ఈ కాపర్ పైపులు 206 కేజీల ఉండగా వీటి విలువ సుమారు రూ.2.5లక్షలు ఉంటుందని చెప్పారు. వేరే కేసుకు సంబంధించి వీరిలో ఇద్దరి నుంచి అరతులం పుస్తెలతాడు, అరతులం నల్లపూసలు, రూ.3 వేల నగదు కూడా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని, తదుపరి రిమాండ్‌కు పంపించేలా చర్యలు ఉంటాయని చెప్పారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ ఎల్.దామోదరరావు, ఏఎస్‌ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

శాశ్వత లోక్‌అదాలత్‌లో కేసుల రాజీ

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికళ్యాణ్ చక్రవర్తి


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికళ్యాణ్ చక్రవర్తి

విజయనగరం క్రైమ్: శాశ్వత లోక్‌అదాలత్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ బి.సాయికళ్యాణ్ చక్రవర్తి పిలుపునిచ్చారు. జిల్లా న్యాయసేవా సదన్‌లో శనివారం నిర్వహించిన న్యాయఅవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శాశ్వత లోక్ అదాలత్‌లో ప్రతిరోజూ రవాణా, పోస్టల్, టెలిగ్రాఫ్, ఎలక్ట్రిసిటీ తదితర ప్రజా వినియోగసేవలకు సంబంధించిన కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. ప్లాపస్ చైర్మన్ జి.దుర్గయ్య మాట్లాడుతూ వైద్యం, బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్, ఇన్సూరెన్స్, ఆస్పత్రులు తదితర సేవల్లో లోపముంటే కోటిరూపాయల వరకు నష్టపరిహారం పొందగలిగిన కేసులను ఇక్కడ ఉచితంగా, ఎటువంటి రుసుం లేకుండా ఫైల్ చేసుకుని పరిహారం పొందవచ్చన్నారు. ఫీజు లేకుండా కేసులు ఫైల్ చేసుకునే సదుపాయం కేవలం లోక్‌అదాలత్, శాశ్వత లోక్ అదాలత్‌లో మాత్రమే ఉందని సీనియర్ సివిల్ జడ్జి కె.నాగమణి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, న్యాయమూర్తులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం పూల్‌బాగ్:

డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో 2023–24 విద్యాసంవత్సరానికి మిగిలి ఉన్న పరిమిత ఖాళీ సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా సమన్వయకర్త టి.పద్మజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో బాలురు–5 , బాలికల గురుకులాలు–8 ఉన్నాయి. ఆయా విద్యాలయాల్లో 6, 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్లలో ప్రవేశానికి ఆసక్తిగల బాలబాలికలు ఆధార్‌కార్డు, కులధ్రువీకరణపత్రం జతపరిచిన దరఖాస్తును ఈ నెల 28వ తేదీ సాయంత్రం 4 గంటలలోగా అందజేయాలన్నారు. దరఖాస్తుదారులు ఈ నెల 30న ఉదయం 10 గంటలకు దరఖాస్తు చేసుకున్న గురుకులంలో ప్రవేశపరీక్షకు హాజరుకావాలన్నారు. ప్రశ్నపత్రం ముందు తరగతికి చెందిన సిలబస్ ప్రకారం ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుందన్నారు. ప్రతి పాఠశాలలో ఖాళీల వివరాలు ఆయా పాఠశాల నోటీసుబోర్డులో ఉంచామన్నారు.

ఉద్యోగాలకు 31 మంది ఎంపిక


ఎల్‌అండ్‌టీ కంపెనీ ప్రతినిధులు అందజేసిన ఎంపిక పత్రాలతో అభ్యర్థులు

రాజాం సిటీ: స్థానిక ఐటీఐ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాలో 31 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు తెలిపారు. కళాశాల ఆవరణలో హైదరాబాద్‌కు చెందిన ఎల్‌అండ్‌టీ కంపెనీ ప్రతినిధులు ఎలక్ట్రీషియన్, వెల్డర్, డీఎం సివిల్, ఫిట్టర్ ట్రేడ్‌లకు సంబంధించి నిర్వహించిన జాబ్ మేళాకు 52 మంది అభ్యర్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఎంపిక పత్రాలు అందజేశారు.

పీహెచ్‌సీ వైద్యులకు బదిలీలు

విజయనగరం ఫోర్ట్: వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని పలు పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులకు బదిలీలు అయింది. రెల్లివలస పీహెచ్‌సీలో పనిచేస్తున్న డాక్టర్ త్రివేణికి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి, జామి పీహెచ్‌సీ వైద్యురాలు భాగ్యరేఖకు ఎల్.కోటకు బదిలీ అయింది. మామిడిపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు తెర్లాం పీహెచ్‌సీకి, విశాఖ జిల్లా మునగపాక పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ అనిల్‌కుమార్‌కు ఎల్.కోట పీహెచ్‌సీకి, పాగిరి పీహెచ్‌సీ వైద్యుడు పి. లింగరాజుకు శ్రీకాకుళం బదిలీ అయింది. శ్రీకాకుళం కుటుంబ సంక్షేమ కేంద్రం వైద్యుడు డాక్టర్ కృష్ణమోహన్ పాగిరి పీహెచ్‌సీ వైద్యుడిగా బదిలీ అయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్లూరు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ దివ్యభారతికి తెర్లాం పీహెచ్‌సీకి, గంట్యాడ పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ శీతల్‌వర్మకు డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా దంగేరు పీహెచ్‌సీకి, బొబ్బిలి పీపీయూనిట్ వైద్యుడు శివకుమార్‌కు మామిడిపల్లి పీహెచ్‌సీకి బదిలీ అయింది. దత్తిరాజేరులో పనిచేస్తున్న సీహెచ్‌ఓ సత్యనారాయణకు మెంటాడ పీహెచ్‌సీకి, నల్లజర్లలో పనిచేస్తున్న చంద్రశేఖరరాజుకు రామభద్రపురం పీహెచ్‌సీకి బదిలీ చేశారు.

క్రీడాపాఠశాలలో ప్రవేశాలకు ఎంపికలు


విద్యార్థులకు పరుగుపోటీ

విజయనగరం: కడప జిల్లాలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు సెట్విజ్ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ క్రీడామైదానంలో శనివారం ఎంపిక పోటీలు నిర్వహించారు. వీటికి 20 మంది విద్యార్థులు హాజరుకాగా.. వారికి ఎత్తు, బరువు, బ్రాండ్ జంప్, 800 మీటర్ల పరుగు పోటీ, మెడిసెన్ బాల్ త్రోయింగ్, షటిల్ రన్ పరీక్షలు నిర్వహించారు. చీఫ్ కోచ్ ఎల్.వి.రమణ ఆధ్వర్యంలో జరిగిన ఎంపిక పోటీల్లో ఇద్దరు క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఎంపికైన క్రీడాకారులను గుంటూరు జిల్లాలోని నాగార్జున యూనివర్సిటీలో త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. ఎంపిక పోటీలను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కోచ్‌లతో పాటు అథ్లెటిక్ అసోసియేషన్ ప్రతినిధులు పర్యవేక్షించారు.